# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 156 క్రిష్ణా, సోమవారం 02- 03 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్టంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349



## ముఖ్య గమనిక

మీ వివాహాది శుభకార్యముల కొరకు
మరియు మీ పెళ్లిరోజు, పుట్టినరోజు ప్రకటనల కొరకు
మరియు మీ వ్యాపార ఇతర కార్యముల
ప్రకటనల కొరకు మా పత్రికలో అతి తక్కువ ధరలో
ప్రకటనలు వేయబడును.

ఇతర వివరముల కొరకు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## మిత్రులకు నమస్కారం,

సత్తెనపల్లి పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో పరివర్తన స్కూల్ ఎదురుగా ఉన్న క్రైమ్ కౌంటర్ దినపత్రిక రాష్ట్ర కార్యాలయం వద్ద క్రైమ్ కౌంటర్ దినపత్రిక యాజమాన్యం చేతచలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుంది. చలివేంద్రాన్ని మన MEF ఆధ్వర్యంలో 3/3/2026 మంగళవారం రోజున ఉదయం 9 గంటలకు MEF నాయకుల చేత ప్రారంభోత్సవం చేయబడుతుంది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా MEF పల్నాడు జిల్లా నాయకులు, సత్తెనపల్లి నాయకులు హాజరవుతున్నారు.

కావున ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయవలసినదిగా ఆహ్వానిస్తున్నాం.


ఇట్లు

శ్రీ కటికల వరప్రసాద్, స్టాఫ్,డమిత్ర బృందం...

సి. ఈ. ఓ.& ఎడిటర్

క్రైమ్ కౌంటర్ దినపత్రిక, సత్తెనపల్లి.ఆంధ్రప్రదేశ్

## యూఏఈపై దాడులను ఖండిస్తున్నా: మోదీ



క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ, మార్చి 1: ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించారు. యూఏఈపై జరిగిన దాడులను ఆయన ఖండించారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో తాను ఫోన్ ద్వారా మాట్లాడానంటూ మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దాడుల్లో ప్రాణ నష్టంపై ఆయన సంతాపం తెలిపారు. కష్ట సమయంలో యూఏఈ వెన్నంటే భారత్ ఉ ంటుందన్నారు. యూఏఈలో ఉంటోన్న భారతీయులకు సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నందుకు నహ్యాన్‌కు ధన్యవాదాలు తెలిపానన్నారు. ఉద్రిక్తతలు తగ్గడానికి, ప్రాంతీయ శాంతి, భద్రత, సుస్థిరతకు మద్దతిస్తామంటూ ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల తర్వాత ఇరాన్ యూఏఈతో పాటు పలు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ తరుణంలో మోదీ తాజా పోస్ట్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. మరోవైపు ఢిల్లీలోని ప్రధాని నివాసంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ సమావేశం జరిగింది. మూడు గంటలకు పైగా సాగిన సమావేశంలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్, నిర్మల, జాతీయ భద్రతా సలహాదారు డొబాల్ తదితరులు హాజరయ్యారు.

## తిరుపతిలో కోర్టు భవన సముదాయానికి భూమి పూజ



క్రైం కౌంటర్ న్యూస్, తిరుపతి: రూరల్ దామినీడులో 120 కోట్ల రూపాయలతో 14.44 సెంట్ల భూమిపై 16 కోర్టు భవన సముదాయాని భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమల ఆలయానికి సమానమైన ఆలయం మరొకటి లేదని కోట్లాది మంది భక్తులు భావిస్తారు. అలాగే, తిరుపతిలో నిర్మిస్తున్న కోర్ట్ కాంప్లెక్స్ కూడా న్యాయం అందించటంలో మరో 'ఆలయం' కావాలన్నారు. ఏపీలోని విజనరీ ప్రభుత్వం రాబోయే వంద సంవత్సరాలకు అవసరమైన విధంగా కోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం అభినందనీయం అని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు.న్యాయం అందించడంలో టైంలైన్ అవసరమని చెప్పారు. బెంచ్, బార్ వేరు వేరు కాదని, బార్ నుంచి వాదన సరిగ్గా ఉన్నప్పుడే జడ్జిల నుంచి నాణ్యమైన తీర్పులు ఉంటాయని చెప్పారు. నాణ్యమైన తీర్పులు వచ్చినప్పుడు, ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని అన్నారు.

# హ్యాపీ బర్త్ డే నితీశ్ జీ..

## ప్రజాసేవలో మరింత ముందుకెళ్లాలి: సీఎం చంద్రబాబు



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, మార్చి 1బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 76వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు రాజకీయ ప్రముఖులు, కేంద్ర మంత్రులు,ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ట్విట్టర్(ఎక్స్) వేదికగా స్పందించిన చంద్రబాబు, నితీష్ కుమార్‌కి తన సందేశాన్ని పంపారు. నితీశ్ కుమార్ ప్రజాసేవలో మరింత కాలం ఆరోగ్యంగా, ఆనందంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. బీహార్ అభివృద్ధిలో నితీశ్ కుమార్ పాత్రను, ఆయన చేస్తున్న విశేష కృషిని ఈ సందర్భంగా గుర్తుచేస్తూ, ఆయనకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. నితీశ్ కుమార్ భారత రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞులైన నేతలలో ఒకరని ప్రశంసించారు. బీహార్ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## అంగన్వాడీల సంక్షేమానికి కూటమి కట్టుబడి ఉంది: హోం మంత్రి అనిత



క్రైం కౌంటర్ న్యూస్,అమరావతి, మార్చి 01: అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వంతోపాటు సీఎం చంద్రబాబు నాయుడికి దక్కుతుందన్నారు. ఆదివారం అమరావతిలో అంగన్‌వాడీ కార్యకర్తలతో హోం మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 86.68 లక్షలు విడుదల చేశామన్నారు. అలాగే ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. తద్వారా జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టామని వివరించారు.

58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5+ స్మార్ట్ ఫోన్లు అందించామన్నారు. ఈ ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంతోపాటు సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల హాజరు 70 శాతం నుంచి 96 శాతానికి పెరగడం.. కూటమి పాలనకు వచ్చిన ప్రత్యక్ష ఫలితమని అభివర్ణించారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురు చూసిన గ్రాట్యుటీ కలను కూటమి ప్రభుత్వం నిజం చేసిందని హోం మంత్రి అనిత వివరించారు.

గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో రూ. 20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీలను పూర్తి స్థాయి అప్‌గ్రేడ్ చేస్తోందని భరోసా ఇచ్చారు. అందులో భాగంగా మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్‌గా పదోన్నతి కల్పించి, పూర్తి స్థాయి వేతనాలు అందించనుందని హోం మంత్రి అనిత వివరించారు. అలాగే కొత్తగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను కూటమి ప్రభుత్వం నియమించనుందని మంత్రి అనిత వెల్లడించారు.

అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో తొమ్మిదింటిని ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత వరకు అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ.. ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అంగన్‌వాడీలకు ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తూ, ఉద్యోగులకు భరోసాగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళ తీసి వెళ్ళిందని విమర్శించారు. వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు ఇంకా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి నేడు రాష్ట్రంలో నెలకొందని హోం మంత్రి అనిత ఆవేదన వ్యక్తం చేశారు.

# యుద్ధ భయంతో గల్ఫ్ కుటుంబాల్లో వణుకు

**ఇరాన్‌పై విరుచుకుపడిన అమెరికా, ఇజ్రాయిల్**
**జిల్లాలో వందల సంఖ్యలో ప్రవాస కుటుంబాలు**
**– క్షేమ సమాచారం కోసం బంధువుల ఆరా**



క్రైం కౌంటర్ న్యూస్, జగిత్యాల, మార్చి1 మెరుగైన భవిష్యత్తును ఆశించి ఎడారి బాట పట్టిన గల్ఫ్ కుటుంబాలు యుద్ధభయంతో బిక్కు బిక్కు మంటున్నాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరి' పేరుతో అగ్రరాజ్యం చేపట్టిన దాడులతో గల్ఫ్ అంతటా యుద్ధాగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి. పశ్చిమాసియాలో భీకర యుద్ధం జరుగుతుండడం జిల్లాలోని పలు కుటుంబాలను కలవరపరుస్తోంది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ భారీ దాడులకు దిగడం, ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకు పడుతుండడం తదితర పరిస్థితులు జిల్లాలోని వలస కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం జోరుగా జరుగుతుండడంతో పశ్చిమాసియాకు వేలకొద్ది విమానాలు రద్దయ్యాయి. యుద్ధాన్ని విరమించి చర్చలు జరపాలని భారత్ పిలుపు ఇచ్చింది.

15 లక్షల మంది గల్ఫ్ కార్మికులు...

గల్ఫ్ దేశాల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన వలస కార్మికులు 15 లక్షల వరకు ఉంటారని ఒక అంచనా ఉంది. ఇందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి 3 లక్షలు, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి 2.50 లక్షలు, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి 1.80 లక్షల మంది వివిధ దేశాలకు పనుల నిమిత్తం వెళ్లినట్లు అంచనాలున్నాయి. జగిత్యాల జిల్లా వాసులు సుమారు 2 లక్షల మంది విదేశాలకు ఉపాధి నిమిత్తం వలస వెళ్లినట్లు ఓ అంచనా ఉంది. ఇందులో అత్యధికంగా యూఏఈ, సౌదీ అరేబియా వెళ్లగా మరికొంత మంది కువైట్, ఓమన్, ఖతార్, బహ్రెయిన్, మలేషియా, సింగపూర్ దేశాల్లో జిల్లాకు చెందిన పలువురు వలస కార్మికులు పనులు చేస్తున్నారు.

ఫోన్ చేసి క్షేమ సమాచారం..

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్లలోని గ్రామాల నుంచి ఉపాధి కోసం ఎడారి దేశాల్లో అత్యధిక సంఖ్యలో బతుకుతున్నారు. ఇరాన్ దేశం యూఏఈతో పాటు ఇతర దేశాలపైన బాంబుల వర్షం కురుస్తుండడంతో అక్కడ ఉంటున్న గల్ఫ్ కుటుంబాలు బిక్కు బిక్కుమంటున్నాయి. ఇప్పటికే మిస్సైల్ దాడిలో పాకిస్తాన్ జాతీయుడు ఒకరు మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో జిల్లాలోని పల్లెల నుంచి వలస వెళ్లిన వారి కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. పలువురు ఫోన్ చేసి క్షేమ సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. రెండు, మూడు రోజులు బయటికి రావద్దని సూచిస్తున్నారు. పలువురు జిల్లా వాసులు కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతూ తాము క్షేమంగా ఉన్నామని ఆందోళన చెందవలసిన అవసరం లేదని సమాచారం ఇస్తున్నారు.

సెల్ఫీ వీడియోల విడుదల...

ఇప్పటికే పలువురు వలస కార్మికులు వివిధ రకాల సెల్ఫీ వీడియోలు విడుదల చేస్తున్నారు. తమకు ఎలాంటి ప్రమాదం లేదని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దూసుకువస్తున్న మిస్సైల్స్‌తో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఎడారి దేశాల్లో ఉంటున్న వలస కార్మికుల్లో ఆందోళన కనబడుతోంది. ఇప్పటికే చాలా మంది బయటకు వెళ్లడం మానేశారు. ముందస్తుగా కావాల్సిన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. యుద్ధం ముగిసిన తర్వాతనే బయటకు వస్తామని కుటుంబ సభ్యులకు వివరిస్తున్నారు. మొత్తంగా గల్ఫ్ దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో జిల్లా ప్రవాస కుటుంబాలు మరింత ఆందోళనకు గురవుతున్నాయి.

విమాన సర్వీసులు రద్దు..

ఇరాన్, గల్ఫ్‌లో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి అబుదాబి, కువైట్, దోహకత్తర్, దుబాయి తదితర దేశాలకు రాకపోకలు సాగిస్తున్న 44 అంతర్జాతీయ విమాన సర్వీసులను వాటి నిర్వహణ సంస్థలు రద్దు చేశాయి. గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన పలు విమానాలతో పాటు శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు రద్దు అయ్యాయి. తాము ప్రకటించే వరకు టికెట్లు బుక్ చేసుకోవద్దని ఆయా సంస్థల ప్రతినిధులు ప్రకటించారు.

పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి...రాజేశుని కృష్ణ, ఫార్మస్యూటికల్ కంపెనీ ఉద్యోగి, తిమ్మాపూర్ గ్రామం

ఎడారి దేశాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. అయితే మేము క్షేమంగానే ఉన్నాము.. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎడారి దేశానికి ఉపాధి నిమిత్తం వచ్చా. అయితే యుద్ధం జరుగుతుండడం వల్ల కొంత ఆందోళనకు గురవుతున్నాము. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

వలస కుటుంబాల్లో ఆందోళన

– బోడ లక్ష్మణ్, తిమ్మాపూర్ గ్రామం, జగిత్యాల జిల్లా

మా అబ్బాయి దుబాయికి ఇటీవలే వెళ్లాడు. అక్కడ రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలతో కొంత ఆందోళన నెలకొంది. యుద్ధ పరిస్థితుల వల్ల జిల్లాలోని వలస కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ఫోన్ చేసి యోగ క్షేమాలు తెలుసుకుంటున్నాము. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాము. భారత ప్రభుత్వం సైతం భరోసా కల్పించడానికి ప్రయత్నిస్తోంది.

అక్కడి చట్టాలను అనుగుణంగా వ్యవహరించాలి

–చెన్నమనేని శ్రీనివాస్‌రావు, ఎన్ఆర్ఐ అడ్వయిజరీ కమిటీ సభ్యులు, జగిత్యాల జిల్లా పశ్చిమాసియాలో భీకర యుద్ధం జరుగుతుండడం పలు కుటుంబాలను కలవరపరుస్తోంది. అయితే ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. భారత ప్రభుత్వం చర్చలు జరపాలని పిలుపునిచ్చింది. ఎప్పటికప్పుడు ప్రవాస కుటుంబాలు యోగ క్షేమాలు తెలుసుకుంటున్నాయి. అక్కడి చట్టాలను గౌరవిస్తూ నిబంధనలు పాటించాలి. అక్కడ గల గల్ఫ్ సంక్షేమ సంఘాలతో అనుసంధానంతో ఉండి జాగ్రత్త వహించాలి.

# నకిలీ పత్రాలతో నిషేధిత భూముల్ని రిజిస్ట్రేషన్ చేస్తే డాక్యుమెంట్ రద్దు



క్రైం కౌంటర్ న్యూస్, చిత్తూరు కలెక్టరేట్, మార్చి 1 నకిలీ పత్రాలతో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం కొరడా ఝులిపించింది. వాటిని రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్ సారథ్యంలోని కమిటీకి అప్పగించింది. రిజిస్ట్రార్ కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రేషన్ల చట్టానికి సవరణ చేస్తూ ప్రభుత్వం గత వారం ఉత్తర్వులు ఇచ్చింది. రిజిస్ట్రేషన్ అధికారి ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటారు. ఐజీ అనుమతితో క్రిమినల్ కేసు కూడా నమోదు చేస్తారు.

22ఎ, 22బి, 22సి జాబితాలోని నిషేధిత భూముల్ని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు ఎవరైనా సంబంధిత రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తే సుమోటాగా డాక్యుమెంట్‌ను రద్దు చేసి చర్యలు ప్రారంభించవచ్చు. ఫిర్యాదుదారుడు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఫిర్యాదు అందిన 15 రోజుల్లో రిజిస్ట్రార్ ప్రాథమిక విచారణ చేయాలి. ఆధారాలు ఉన్నాయని తేలితే రద్దు చర్యలు ప్రారంభించాలి. ఆధారాలు లేదంటే ఫిర్యాదును తిరస్కరించాలి. అందుకు కారణాలను ఫారం–3లోని రిజిస్టర్‌లో నమోదు చేయాలి. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలితే విచారణ ప్రారంభించి డాక్యుమెంట్‌లో పేర్కొన్న పార్టీలకు నోటీసులు ఇవ్వాలి. దస్తావేజు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్ అయిందని తేలితే రాతపూర్వకంగా నమోదు చేసి రద్దు ప్రక్రియను కొనసాగించాలి. దీన్ని జిల్లా స్థాయి కమిటీకి పంపాలి. రిజిస్ట్రార్ నుంచి వచ్చిన నివేదికపై 15రోజుల్లోపు కలెక్టర్ సారథ్యంలోని కమిటీ సమావేశమై రిజిస్ట్రార్ ప్రతిపాదనలతో పాటు వచ్చిన సమాధానాలు, సాక్ష్యాలను సమీక్షిస్తుంది. తమ నిర్ణయాన్ని రిజిస్ట్రార్‌కు పంపిస్తుంది. జిల్లా కమిటీ నిర్ణయం అందిన ఏడు రోజుల్లో రిజిస్ట్రార్ తుది ఉత్తర్వులు జారీ చేయాలి. డాక్యుమెంట్ రద్దు లేదా తిరస్కరణకు సంబంధించిన నిర్ణయాన్ని అందరికి పంపాలి. నిబంధనలకు విరద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తిస్తే రిజిస్ట్రేషన్‌శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ నేరుగా చర్యలు తీసుకోవచ్చు. సంబంధిత పార్టీలకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ రద్దు లేదా ఫిర్యాదును కొట్టివేస్తూ నిర్ణయం తీసుకోవచ్చు. ఏదైనా పత్రం నకిలీదని తేలితే దాని ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయకూడదు. బుక్ నెంబరు–2లో విధిగా నమోదు చేయాలి. కోర్టు, ట్రిబ్యునల్, తాత్కాలిక లేదా శాశ్వత అటాచ్‌మెంట్ చేస్తే వాటిని రిజిస్ట్రేషన్ చేయకూడదు.

# ప్రభుత్వ కాలనీల్లో కనీస సౌకర్యాలు కరువు

**వైసీపీ హయాంలో ఆర్భాటంగా లే అవుట్‌ల ఏర్పాటు**
**– సెంటు, సెంటున్నర చొప్పున స్థలాల కేటాయింపు**
**– మౌలిక సదుపాయలు కల్పించకుండా వదిలేసిన నాటి పాలకులు**
**– ఇళ్లు నిర్మించుకున్న వారికి తప్పని నరకయాతన**
**– అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయాలని వేడుకోలు**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 28: మచిలీపట్నం:గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 665 లేఅవుట్‌లలో 86,084 గృహాలను నిర్మాణం చేసేందుకు గాను లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వీటిలో 65,043 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించగా, ఇప్పటి వరకు 33,783 గృహాల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేశారు. మరో 29,403 గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరు నాటికి లబ్ధిదారులతో నూతన గృహాల ప్రవేశం చేయించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అధ్వానంగా రోడ్లు కాలనీల్లోని రోడ్లను మెరక చేయకపోవడంతో గృహాల నిర్మాణం చేసేవారు, గృహాల నిర్మాణం పూర్తిచేసుకుని అక్కడ నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఈ లే అవుట్‌లలో మెరక పనులు నామమాత్రంగా చేసి బిల్లులు పెట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీరాజ్ విభాగానికి ఈ కాలనీల్లో అంతర్గత రహదారుల పనులను చేయించే బాధ్యతలను అప్పట్లో అప్పగించారు. వైసీపీ ప్రభుత్వంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, తదితరాల నేపథ్యంలో పనులు సక్రమంగా జరగలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాలనీల్లో గృహనిర్మాణాల పనులు తప్ప అంతర్గత రహదారులు, తాగునీరు, విద్యుత సౌకర్యం వంటి పనులు అంతంత మాత్రంగానే చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కాలనీల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి సంబంధించి పనులు చేసేందుకు ఎలాంటి ప్రతిపాదనలు లేవని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు. గతంలో రూపొందించిన పనులను చేసేందుకు మాత్రమే అవకాశం ఉందని, కొత్తగా నిధుల కేటాయింపులు ఏమీ జరగలేదని అధికారులు అంటున్నారు.

వర్షం వస్తే అడుగు పెట్టలేం..

లేఅవుట్‌లలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేయకపోవడంతో అక్కడ నివాసం ఉండేవారు పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షానికే బురదకయ్యలుగా మారుతున్నాయి. గోతులు పడి నడవడానికే ఇబ్బందికరంగా తయారవుతున్నాయి. ఉదాహరణకు మచిలీపట్నం సౌత మండల పరిధిలో రుద్రవరంలో ఏర్పాటు చేసిన రెండు లే అవుట్‌లలో వందలాది గృహాలను లబ్ధిదారులు నిర్మించుకున్నారు. గృహాల మధ్య అంతర్గత రహదారులకు సంబంధించిన పనులు కనీసంగానైనా చేయలేదు. దీంతో ఈ కాలనీలో నివాసం ఉంటున్నవారు ఇళ్లలోకి వెళ్లాలంటే పలు ఇక్కట్ల పాలవుతున్నారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే అంతర్గత రహదారులు బురదకయ్యలుగా మారిపోవడంతో బురద లోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

– గుండుపాలెం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం, వాడపాలెం పంచాయతీ పరిధిలోని వెంకట దుర్గాంబపురం తదితర ప్రాంతాల్లో ఇళ్లస్థలాలుగా ఇచ్చిన భూమి పల్లపు ప్రాంతంలో ఉంది. ఈ లేఅవుట్‌లో రహదారుల నిర్మాణ పనులు చేయకపోవడం, నల్లరేగడి నేల కావడంతో అక్కడ నివాసం ఉండేవారు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు.

–మచిలీపట్నం నగరానికి చెందిన 16 వేల మంది పేదలకు కరగ్రహారంలోని లేఅవుట్‌లో సెంటు భూమి చొప్పున ఇళ్లస్థలాలు ఇచ్చారు. ఇక్కడ అంతర్గత రహదారులకు సంబంధించిన ఒక్క పనీ జరగలేదు. –గన్నవరం మండలం కేసరపల్లి లేఅవుట్‌కు వెళ్లేందుకు రూ.3 కోట్లతో వంతెన నిర్మాణం కోసం అనుమతులు మూడేళ్ల క్రితం వచ్చాయని ప్రకటించారు. కానీ ఇంతవరకు ఈ వంతెన పనులు ప్రారంభించనేలేదు. ఎకరం భూమి రూ.70 లక్షల చొప్పున 60 ఎకరాలు కొనుగోలు చేసి 3వేల మందికి ఇక్కడ ఇళ్లస్థలాలు ఇచ్చారు. ఈ లేఅవుట్‌కు దారి కోసం వంతెన నిర్మాణాన్ని మాత్రం చేయకుండా పక్కనపెట్టేశారు. దీంతో ఇక్కడ గృహాలు నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులు సరైన దారిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని లే అవుట్‌లలో అంతర్గత రహదారులను మెరక చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తరచూ అధికారులకు సూచిస్తున్నా, ఆ దిశగా అడుగులు పడనిస్థితి నెలకొంది. ఈ వేసవిలోనైనా లేఅవుట్‌లలో అంతర్గత రహదారులను మెరక చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# మహారాష్ట్రలో 17 మంది సజీవ దహనం

మైనింగ్–పారిశ్రామిక పేలుడు పదార్థాల ఫ్యాక్టరీలో విస్ఫోటం



క్రైం కౌంటర్ న్యూస్, నాగ్‌పూర్, మార్చి 1: మైనింగ్–పారిశ్రామిక పేలుడు పదార్థాలు తయారు చేసే ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 17 మంది సజీవ దహనమయ్యారు. గుర్తుపట్టడానికి వీలులేని విధంగా మృతదేహాలు కాలిపోవడంతో మృతుల గుర్తింపు కోసం కుటుంబసభ్యుల నుంచి డీఎన్ఏ శాంపిళ్లను అధికారులు సేకరిస్తున్నారు. ఘటనలో మరో 18 మందికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా కాటోల్ మండలం రావుల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో ఆదివా రం ఉదయం ఈ పేలుడు సంభవించింది. ఘటన స్థలంలో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్ఎ?ఫతోపాటు పీఈఎ?సవో(పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫిటీ ఆర్గనైజేషన్), డీఐఎ?సఎ?స(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ సెక్యూరిటీ) బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి, వైద్యం అందిస్తున్నామన్నారు. స్థానిక అధికారుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నామని వెల్లడించారు. కాగా, కంపెనీకి చెందిన ప్యాకింగ్ యూనిట్‌లో ఉదయం 7 గంటల నుంచి 7.15 గంటల మధ్యలో ఈ పేలుడు సంభవించిందని ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఆ సమయంలో పేలు డు పదార్థాల తయారీ ప్రక్రియలేమీ జరగడం లేదు. పేలుడుకు కారణం ఏమిటనేదానిపై దర్యాప్తు కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నాం' అని పేర్కొంది. తక్షణమే అత్యవసర స్పందన ప్రొటోకాల్స్‌ను అమలు చేశామని, పరిస్థితి నియంత్రణలోకి వచ్చిందని తెలిపింది. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది.

# ఇంద్రకీలాద్రిపై 'మహా' సందడి

**6 నుంచి మహా కుంభాభిషేక మహోత్సవం**
**8వ తేదీ వరకు జరగనున్న పవిత్ర క్రతువు**
**భక్తుల కోసం ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు**
**రోజుకు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా**
**మహాకుంభాభిషేకం రోజున పెరుగుతారని లెక్క**
**ఓం మలుపు నుంచి క్యూలైన్లు**
**మూడు రోజులు ఉచిత దర్శనాలు**



క్రైం కౌంటర్ న్యూస్,విజయవాడ/ఇంద్రకీలాద్రి):ఇంద్రకీలాద్రిపై మరో ఐదు రోజుల్లో మహా కుంభాభిషే సందడి ప్రారంభం కాబోతోంది. ప్రతి ఆలయంలో ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే ఈ కుంభాభిషేకాన్ని ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు నిర్వహించాలని పండితులు నిర్ణయించారు. ఇంద్రకీలాద్రిపై ఇప్పటి వరకు 12 ఏళ్లకు ఒకసారి ఈ క్రతువును నిర్వహించారు. ఈసారి మాత్రం 13వ ఏట నిర్వహిస్తున్నారు. ఇంద్రలాద్రిపైన, కింద వివిధ నిర్మాణపు పనుల కారణంగా ఒక ఏడాది ఆలస్యమైంది. ఆగమశాస్త్రాల ప్రకారం 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించాలని ఉన్నప్పటికీ ఒక ఏడాది ఆలస్యంగా చేయడం వల్ల ఎలాంటి దోషాలు ఉండవని పండితులు పేర్కొంటున్నారు. కుంభాభిషేక క్రతువు ప్రారంభం కావడానికి మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మహాకుంభాభిషేకం మూడు పవిత్ర దినాల్లో నిర్వహిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కుంభాభిషేకం క్రతువు శుక్రవారం ప్రారంభమై ఆదివారంతో ముగుస్తుంది. చివరి రోజున కనకదుర్గమ్మ ప్రధానాలయం గోపురానికి పవిత్ర నదీ జలాలతో అభిషేకం చేస్తారు. యాగశాలలో పూర్ణాహుతి పూర్తయిన తర్వాత కుంభాభిషేకం చేస్తారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు కుంభాభిషేకాన్ని వీక్షించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి మొత్తం క్రతువును ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ప్రధానాలయం చుట్టూ పరంజామా ఏర్పాటు చేస్తారు. పండితులు దాని పైనుంచి గోపుర శిఖరానికి కుంభాలతో అభిషేకం చేస్తారు. దీన్ని దగ్గర నుంచి భక్తులు వీక్షించే ఆస్కారం ఉండదు. మొదటి రోజున జరిగే యాగశాల ప్రవేశం దగ్గర నుంచి కుంభాభిషేకం పూర్తయ్యే వరకు అన్ని ప్రక్రియలను ప్రత్యక్ష ప్రసారం చేయడం వల్ల భక్తులకు సంతృప్తి కలుగుతుందన్న భావనలో అధికారులు ఉన్నారు.

నో వీఐపీ సేవలు! కుంభాభిషేకం జరిగే మూడు రోజులపాటు ఎలాంటి ప్రొటోకాల్ దర్శనాలు ఉండవు. క్రతువు పూర్తయ్యే వరకు అన్ని రకాల ఆర్జిత సేవలతోపాటు వీఐపీ దర్శనాలను రద్దు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. రూ.500 టికెట్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తారు. అన్ని క్యూల నుంచి భక్తులు ఉచితంగా ప్రవేశించవచ్చు. కుంభాభిషేకానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఘాట్‌రోడ్డులోని ఓం మలుపు నుంచి క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. రోజుకు లక్ష మంది భక్తులు 12 ఏళ్లకు ఒక్కసారి జరిగే ఈ ఘట్టాన్ని తిలకించడానికి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కుంభాభిషేకం చివరి రోజు ఆదివారం నాడు ఈ సంఖ్య మరింతగా పెరుగుతుందని భావిస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఈవో ఆలయంలో జరుగుతున్న పనులను ఆదివారం క్షేత్రస్థాయిలో ఈవో వి.కె.శీనానాయక్ పరిశీలించారు. స్థానాచార్యుడు శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యులు, ఉప ప్రధాన అర్చకుడు శాండిల్య, వేదపండితులు షణ్ముఖ శాని?త్రతో కలిసి విమాన గోపురం ఆలయ ప్రాంగణంలోని వివిధ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇంజనీరింగ్ విభాగం ఈఈ రమ, డీఈ అశోక్, ఇంజనీరింగ్ సిబ్బందితో భక్తుల సౌకర్యాల గురించి చర్చించారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ప్రసాద వితరణలో ఎక్కడా రాజీ పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఈవో ఆదేశించారు. 8వ తేదీ ఉదయం 9.34 గంటలకు మేష లగ్నంలో ప్రధాన కుంభాభిషేకం జరగనుంది. ఈ కార్యక్రమం కంచి కామకోటి పీఠాధిపతి శంకరజయేంద్ర సరస్వతి మార్గదర్శకాల మేరకు శానో?త్రక్తంగా నిర్వహించనున్నారు.

కుంభాభిషేకం ఎన్ని రకాలంటే.. కుంభాభిషేకం రెండు విధాలుగా నిర్వహిస్తారు. ఇందులో ఒకటి మహాకుంభాభిషేకం. రెండోది సమ్మేళన కుంభాభిషేకం. మహాకుంభాభిషేకాన్ని ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. దీన్ని ఆలయ పునరుద్ధరణ తర్వాత, దైవ చైతన్య పునరుద్ధరణ, భక్తుల శ్రేయస్సు కోసం చేస్తారు. ఆలయంలో మరమ్మతులు, విస్తరణ, గోపుర నిర్మాణం, జీర్ణోద్ధరణ చేసినప్పుడు దేవతా శక్తిని ఆహ్వానించడానికి మహాకుంభాభిషేకం చేస్తారు. ఆలయ గోపురం, విమాన గోపురం, ధ్వజస్తంభం, విగ్రహాలకు పవిత్ర నదీ జలాలతో అభిషేకం చేస్తారు. ఈ కుంభాభిషేకాన్ని సాధారణంగా 3-12 రోజులపాటు నిర్వహిస్తారు. మహాకుంభాభిషేకం ఆలయానికి ఒక పునర్జన్మ వంటిదని ఆగమ పండితులు భావిస్తారు. నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే పుణ్యక్షేత్రాల్లో స్పృశ్య, అస్పృశ్య దోషాలు జరిగే అవకాశాలు ఉంటాయి. వాటికి పరిహారంగా ఈ క్రతువును నిర్వహిస్తారు. అదేవిధంగా కొన్ని ఆలయాల్లో సమ్మేళన కుంభాభిషేకం చేస్తారు. ఒక ప్రాంగణంలో ఉన్న ఆలయాలకు, గోపురాలకు, ధ్వజస్తంభాలకు ఒకేసారి అభిషేకం చేస్తే దాన్ని సమ్మేళన కుంభాభిషేకంగా పేర్కొంటారు. ఆలయ సముదాయం మొత్తాన్ని పునరుద్ధరించినప్పుడు, అనుబంధ దేవతల సన్నిధిలన్నింటిలో ఒకేసారి శక్తి ఆవాహన చేయాలనుకున్నప్పుడు ఈ సమ్మేళన కుంభాభిషేకం చేస్తారు. ఇందులో ప్రధాన దేవాలయంతోపాటు ఉపాలయాలన్నింటిల్లోను ఈ క్రతువును నిర్వహిస్తారు.

# ఆస్తుల పరిరక్షణపై జడ్పీ దృష్టి

**ఆక్రమణల బెడద నుంచి రక్షణకు చర్యలు**
**రీ సర్వే రికార్డుల్లో జడ్పీ పేరుతో నమోదుకు యత్నం**
**మూడు జిల్లాల కలెక్టర్లకు సీఈవో లేఖ**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, మార్చి 1 ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణకు అధికారులు నడుం బిగించారు. మండల, డివిజన్ కేంద్రాలు, ప్రముఖ కూడళ్లలోని ఆస్తుల రక్షణకు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. విశాఖ నగరంలోని ఆస్తులను పూర్తిగా సద్వినియోగం చేయడంతోపాటు వాటికి ప్రహరీగోడలు నిర్మించనున్నారు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు పూర్వం స్థలాలను విరాళంగా ఇచ్చిన వారి వారసులమంటూ ఇప్పుడు కొందరు కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. దీంతో ఆయా స్థలాల పరిరక్షణకు న్యాయసలహా తీసుకుంటున్నారు. భూముల రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో అన్ని పాఠశాలలు, అతిథిగృహాలు, ఇతర ఆస్తులను జడ్పీ పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేయాలని కోరుతూ విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లకు జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఇటీవల లేఖ రాశారు.

ఉమ్మడి జిల్లాలో 240 వరకు జడ్పీ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ కార్యాలయాల పరిధిలో ప్రాథమిక, యూపీ పాఠశాలలు ఉన్నాయి. అధికశాతం పాఠశాలలను ప్రభుత్వ స్థలాల్లో నెలకొల్పారు. కొన్నిచోట్ల స్థానికంగా దాతలు ఇచ్చిన భూముల్లో ఏర్పాటుచేశారు. గ్రామాల్లో ఉన్న పాఠశాలల స్థలాలకు ఇబ్బంది లేకపోయినప్పటికీ మండల కేంద్రాలు, బిజీ కూడళ్ల వద్ద వున్న పాఠశాలల ఆస్తుల రక్షణకు సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతి పాఠశాలకు గతంలో కేటాయించిన మేరకు ప్రస్తుతం స్థలం ఉందా? ఆక్రమణకు గురైందా? అన్న దానిపై పూర్తివివరాలు ఇవ్వాలని మండల పరిషత్ అధికారులు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలను ఆదేశించారు.

సింహాచలం గోశాల జంక్షన్‌లో శిథిలమైన జడ్పీ అతిథిగృహం స్థలం ఆక్రమణకు గురికాకుండా తాజాగా అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. గోపాలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకుని షాపింగ్‌మాల్ నిర్మించిన వ్యక్తిపై కోర్టులో వేసిన కేసు విచారణలో ఉంది. అదేప్రాంతంలో మరికొంత స్థలం ఆక్రమణకు గురికాకుండా క్రీడాశాఖకు అప్పగించారు.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం దోసూరు ఉన్నత పాఠశాలకు గతంలో భూమి ఇచ్చిన దాతల వారసులు ఇప్పుడు ఆ భూమి తమదంటూ వాదిస్తున్నారు. దీనిపై జడ్పీ యాజమాన్యం న్యాయపోరాటం చేస్తున్నది. అనకాపల్లి పట్టణ శివారులోని కొత్తూరులో జిల్లా పరిషత్తుకు చెందిన భూమిని చాలాకాలం క్రితం స్థానికులు ఆక్రమించుకొని ఇళ్ల నిర్మించుకున్నారు. మిగిలిన స్థలంపై మరికొందరు కన్నేశారు. దీంతో అధికారులు అప్రమత్తమై మిగిలిన భూమిని ఆటస్థలంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. కె.కోటపాడు ఉన్నత పాఠశాల స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణానికి ముందే కొంతమేర స్థలం ఆక్రమణకు గురైందనే వాదన ఉంది. దేవరాపల్లి మండలంలో ఓ ఉన్నత పాఠశాల ఆస్తిని కొందరు తమదిగా క్లెయిమ్ చేస్తుండడంపై ఇటీవల జడ్పీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. గ్రామాల్లో ఇళ్ల మధ్య ఉన్న ప్రాథమిక పాఠశాలల స్థలాలను స్థానికులు ఆక్రమించుకున్న ఘటనలు వున్నాయి. దీంతో అన్ని ఉన్నత పాఠశాలకు ప్రహరీగోడల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలు సమావేశాల్లో జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను ఆదేశించారు.

భద్రతకు వీలుగా...

ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో కొన్నిచోట్ల జడ్పీ/ మండల పరిషత్ పాఠశాలలు రెవెన్యూ రికార్డుల్లో గ్రామ కంఠాలుగా నమోదైన విషయాన్ని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం జరుగుతున్న భూముల రీసర్వే సందర్భంగా ఈ ఆస్తులను రెవెన్యూ రికార్డుల్లో జడ్పీ/మండల పరిషత్ పేర్లతో నమోదుచేయాలని మూడు జిల్లాల కలెక్టర్లను జడ్పీ సీఈవో కోరుతూ లేఖలు రాశారు. రీసర్వేలో భాగంగా 1(బీ), ఫెయిర్ అడంగల్‌లో గ్రామ కంఠం కాకుండా జడ్పీ/ మండల పరిషత్ పేరున నమోదుచేయాలని కోరారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ అధికారులు ఆయా మండలాల్లోని తహశీల్దార్లను కలిసి జడ్పీ, మండల పరిషత్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరాలని ఆదేశించినట్టు జడ్పీ సీఈవో నారాయణమూర్తి తెలిపారు. రీసర్వేలో జడ్పీ/మండల పరిషత్ పేర్లు నమోదుచేసేలా చూడాలని సూచించామన్నారు.

# ఖమేనీ కదలికలపై కొన్ని నెలలుగా నిఘా

**పక్కా సమాచారం సేకరించిన ఇజ్రాయెల్, అమెరికా గూఢచారులు**
**శనివారం ఉదయం సలహాదారులతో భేటీ అవుతున్నట్లు గుర్తింపు**
**వెంటనే ఆయన నివాసంపై 30 బాంబులు కుమ్మరించిన ఇజ్రాయెల్**



క్రైం కౌంటర్ న్యూస్,వాషింగ్టన్, మార్చి1: ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అంతమొందించటంలో అమెరికా, ఇజ్రాయెల్‌లు పక్కా ప్రణాళికతో ముందుకు కదిలాయి. ఖమేనీ ఎప్పుడు ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? ఆయనను ఎవరు కలుస్తున్నారు? అనే సమాచారాన్ని అత్యంత కచ్చితత్వంతో సేకరించి, గురిచూసి దాడి చేశాయి. ఖమేనీయే లక్ష్యంగా ఈ రెండు దేశాలు కొన్ని నెలలుగా అత్యంత రహస్య ఆపరేషన్ నిర్వహించినట్లు అమెరికా మీడియా పేర్కొంది. అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ, ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ ఏజెంట్లు ఎవరికి వారు ఖమేనీ సమాచారాన్ని సేకరిస్తూ.. దానిని ఎప్పటికప్పుడు పరస్పరం పంచుకున్నారు. ఖమేనీని అంతం చేయటంలో ఆంత్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను కూడా వాడుకున్నట్లు తేలింది.

శనివారం మీటింగ్..వెంటనే దాడి

ఖమేనీ తన సలహాదారులు, మిలిటరీ ఉన్నతాధికారులతో శనివారం మూడు సమావేశాల్లో పాల్గొనబోతున్నట్లు అమెరికా, ఇజ్రాయెల్ గూఢచారులు గుర్తించారు. ఆ సమావేశాలు ఎక్కడ జరగబోతున్నాయన్న కచ్చితమైన సమాచారం తెలియనప్పటికీ.. శనివారం సాయంత్రం అత్యంత కీలక సమావేశం జరుగుతుందని ఇరాన్‌లోని సీఐఏ ఏజెంట్లు తొలుత తమ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే, ఆ సమావేశం శనివారం ఉదయమే జరుగుతోందని మోసాద్ ఏజెంట్లు కచ్చితమైన సమాచారం సేకరించి, స్వదేశంతోపాటు అమెరికాకు చేరవేశారు. ఈ అవకాశం చేజారితే ఖమేనీ రహస్య ప్రదేశానికి వెళ్లిపోవచ్చని భావించిన రెండు దేశాలు.. వెంటనే రంగంలోకి దిగాయి. అమెరికా మిలిటరీతో సమన్వయం చేసుకొంటూ ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఖమేనీ నివాసంపై ఒకేసారి 30 బాంబులను కుమ్మరించాయి. దీంతో ఆ భవనం తునాతునలు అయిపోయింది. దాడికి ముందు సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీతోపాటు మరీ కీలక నేత షంఖానీతో ఖమేనీ సమావేశమైనట్లు ఇరాన్ అధికార వర్గాలు తెలిపాయి.

ఆంత్రోపిక్ క్లాడ్‌తో చెక్

ఖమేనీ ఆనుపానులు ఎప్పటికప్పుడు తెలుసుకొనేందుకు, ఆలస్యం కాకుండా అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసేందుకు అమెరికా సైన్యం ఆదేశానికి చెందిన ఆంత్రోపిక్ సంస్థ అభివృద్ధి చేసిన క్లాడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ వార్తా సంస్థ తెలిపింది. అది కూడా అధ్యక్షుడు ట్రంప్ ఆ సంస్థను ప్రభుత్వ సంస్థలు వినియోగించకుండా నిషేధం విధించిన కొన్ని గంటల తర్వాత మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా సైన్యం నిఘా సమాచార అధ్యయనం, టార్గెట్‌ను కచ్చితంగా గుర్తించేందుకు క్లాడ్‌ను వాడుకుందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 3వ తేదీన వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అర్థరాత్రి ఆయన నివాసం నుంచి అపహరించిన ఆపరేషన్‌లో కూడా అమెరికా సైన్యం క్లాడ్ ఏఐనే వినియోగించినట్లు అమెరికా అధికారులను ఉటంకిస్తూ రిపోర్టు చేసింది.

సౌదీ యువరాజు మంత్రాంగం!

ఇరాన్‌పై అమెరికా దాడి చేసేలా సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్ మంత్రాంగం నడిపినట్టు వార్తలు వస్తున్నాయి. అమెరికాకు చెందిన ఓ పత్రిక కథనం ప్రకారం ఆయన గత నెలలో ట్రంప్‌నకు పలుమార్లు ఫోన్ చేసి ప్రయివేటుగా ఈ విషయమై సంభాషించారు. బహిరంగంగా ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడినా లోలోపల లాబియింగ్ జరిపి అమెరికా దాడి చేసేలా చూశారని ఆ పత్రిక పేర్కొంది. అరబ్ పత్రికల కథనం ప్రకారం.. గతంలో అమెరికా ఎయిర్ బేస్‌లపై ఇరాన్ దాడులు చేసిన ప్పుడు సల్మాన్.. పొరుగు దేశాల పాలకులతో మాట్లాడారు. ఇరాన్ దాడుల నుంచి ఆ దేశాలకు భద్రత కల్పించేందుకు వనరులను సమీకరిస్తామన్నారు.

# అమెరికాలో ఉన్న తెలుగువారికి అండగా ఉంటామన్న అయ్యన్నపాత్రుడు

క్రైం కౌంటర్ న్యూస్ మార్చి 01: బహ్రెయిన్‌లోని అమెరికన్ నావల్ బేస్‌పై ఇరాన్ దాడులు చేస్తున్న తరుణంలో అక్కడ ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ఏపీకి చెందిన సుమారు 50 వేల మంది వరకు అక్కడ వివిధ ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బహ్రెయిన్‌లోని ప్రవాస తెలుగువారి యోగక్షేమాలని అయ్యన్నపాత్రుడు అడిగి తెలుసుకున్నారు. గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బహ్రెయిన్‌లో నివసిస్తున్న ప్రవాస తెలుగువారి భద్రతపై ఆరా తీశారు.ముఖ్యంగా నర్సీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన వారు అనేకమంది ఉపాధి నిమిత్తం బహ్రెయిన్‌లో స్థిరపడ్డారని అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల మధ్య నాతవరానికి చెందిన ఎన్నారై శెట్టి సతీశ్‌కు ఇవాళ(ఆదివారం) స్వయంగా ఫోన్ చేసి, అక్కడి తెలుగువారి యోగక్షేమాలను అయ్యన్నపాత్రుడు అడిగి తెలుసుకున్నారు. బహ్రెయిన్‌లో ఉన్న తెలుగువారంతా అప్రమత్తంగా ఉండాలని, స్థానిక ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని దిశానిర్దేశం చేశారు.ఎలాంటి ఆపద వచ్చినా ఏపీఎన్ఆర్టీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని అయ్యన్నపాత్రుడు భరోసా ఇచ్చారు.

# సినిమా



## 'స్పిరిట్'లో డాన్ లీ ఉన్నాడా? లేడా?

ఒకవైపు సినిమా అప్డేట్స్ వస్తున్నా, మరోవైపు ఒక విదేశీ నటుడి గురించి సాగుతున్న ప్రచారం ఇప్పుడు చిత్ర బృందానికి తలనొప్పిగా మారింది. ఆయన ఒక గ్లోబల్ స్టార్.. బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలుపెడితే అది ఎక్కడ ఆగుతుందో ఎవరికీ తెలియదు. ఆయనతో ఒక సెన్సేషనల్ డైరెక్టర్ జతకడితే ఆ సినిమా రేంజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'స్పిరిట్' మొదలైనప్పటి నుండి ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఒక విదేశీ నటుడి పేరు విపరీతంగా వినిపిస్తోంది. కొరియన్ యాక్షన్ స్టార్ ఆ సినిమాలో ఉన్నాడని, ప్రభాస్ తో ఫైట్ చేయబోతున్నాడని లీకులు చక్కర్లు కొట్టాయి. అయితే తాజాగా విడుదలైన ఒక అప్డేట్ చూసిన తర్వాత అభిమానులు కొంత నిరాశకు లోనవుతున్నారు.వివేక్ ఒబేరాయ్ లుక్..

ఇటీవలే చిత్ర బృందం వివేక్ ఒబేరాయ్ లుక్ విడుదల చేసింది. సాధారణంగా ఇదొక క్రేజీ న్యూస్ అవ్వాలి, కానీ ప్రభాస్ అభిమానులు మాత్రం 'జస్ట్ ఓకే' అనేశారు. దీనికి ప్రధాన కారణం.. వారు ఆశించింది కొరియన్ నటుడు డాన్ లీని. గతంలో 'యానిమల్' కోసం బాబీ డియోల్ లాంటి సర్ప్రైజ్ విలన్ ని తీసుకొచ్చి షాక్ ఇచ్చిన సందీప్ వంగా, ఈసారి కూడా అలాంటి ప్రయోగమే చేస్తారని అందరూ భావించారు. వివేక్ మనకు కొత్త కాదు, ఇప్పటికే 'రక్త చరిత్ర', 'వినయ విధేయ రామ' సినిమాల్లో ఆయన విలనిజాన్ని చూసేశాం. అందుకే ఆయన ఎంట్రీ అంతగా సెన్సేషన్ కాలేకపోయింది.

సినిమా మొదలుకాక ముందు నుంచే డాన్ లీ ఈ ప్రాజెక్టులో ఉన్నాడనే వార్త విపరీతంగా ప్రచారంలో ఉంది. దీనిపై సందీప్ రెడ్డి వంగాను ఇంటర్వ్యూలలో అడిగినా ఆయన స్మార్ట్ గా తప్పించుకున్నాడు. ఒకవేళ డాన్ లీ లేకపోయినా అదేదో ముందుగా క్లారిటీ ఇస్తేనే సినిమాకు మంచిదని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా అంతా ఒక విదేశీ నటుడి కోసం ఎదురుచూడటం వల్ల, సినిమాలోని ఇతర ముఖ్యాంశాలు మరుగునపడిపోయే ప్రమాదం ఉంది. ఈ పుకార్లకు త్వరగా చెక్ పెడితేనే 'స్పిరిట్' పక్కాగా హైలైట్ అవుతుంది.ప్రభాస్ బిజీ షెడ్యూల్..

మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం 'ఫౌజీ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత 'కల్కి 2' సెట్స్‌లోకి అడుగు పెట్టాలి. సాధారణంగా ఒక సినిమా చేస్తున్నప్పుడు వేరే ప్రాజెక్టుల జోలికి వెళ్లకూడదని ప్రభాస్ భావిస్తారు, కానీ డెడ్ లైన్స్, బిజీ షెడ్యూల్స్ వల్ల ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో పలు సినిమాలను బ్యాలెన్స్ చేయాల్సి వస్తోంది. 'స్పిరిట్' షూటింగ్ సమయానికి ఆయన పూర్తి డేట్స్ ఇవ్వగలుగుతారా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సందీప్ రెడ్డి వంగా మార్కు యాక్షన్ కు ప్రభాస్ తోడైతే బాక్సాఫీస్ బద్దలవ్వడం ఖాయం. కానీ అభిమానులు ఆశించినట్లుగా డాన్ లీ ఇందులో కనిపిస్తాడా లేక వివేక్ ఒబేరాయ్ తోనే సరిపెట్టుకోవాలా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.





## కడుపు ఉబ్బరమా..? ఏసీడీటీనా..?

తరచుగా కడుపు ఉబ్బరం అనేది కేవలం అధికంగా తినడం లేదా అసిడిటీకి సంకేతంగా భావించి విస్మరిస్తారు. ఒక మాత్ర తీసుకుంటే సమస్య ముగుస్తుందని భావిస్తారు. కానీ మీరు దాదాపు ప్రతిరోజూ మీ కడుపులో బిగుతుగా అనిపిస్తే, సాయంత్రానికి కల్లా మీ బట్టలు బిగుతుగా అనిపిస్తే, లేదా కొన్ని ఆహార పదార్థాలు తీసుకోవడం తర్వాత మీరు కడుపు నిండినట్లు అనిపిస్తే, పరిస్థితి చాలా సులభం కావచ్చు. పేగులు తరచుగా నెమ్మదిగా సంకేతాలను పంపుతాయని అర్థం. తరచుగా ఉబ్బరంగా ఉండే ఏం చేయాలో తెలుసుకుందాం.

ఏసిడిటీ వల్ల గుండెల్లో మంట, పుల్లని త్రేనుపు లేదా పొత్తికడుపు పైభాగంలో మంట వస్తుంది. మరోవైపు, ఉబ్బరం అనేది పొత్తికడుపు ఒత్తిడి, బరువు లేదా ఉబ్బరం అనుభూతి ద్వారా వస్తుంది. రెండూ ఒకేసారి సంభవించవచ్చు, ఇది గందరగోళంగా ఉంటుంది. గ్యాస్, నెమ్మదిగా ప్రేగు కదలికలు, ఆహార అసహనం, హార్మోన్ల మార్పులు లేదా థైరాయిడ్ రుగ్మతలు కూడా అదనపు ఏసిడీటీ లేకుండా ఉబ్బరానికి కారణమవుతాయి. తరచుగా ఉబ్బరం రావడాన్ని తేలికగా తీసుకోకూడదంటున్నారు వైద్య నిపుణులు. ఇది ప్రకోప ప్రేగు సిండ్రోమ్, జీవక్రియ రుగ్మత, హార్మోన్ల అసమతుల్యతకు సంకేతం కావచ్చంటున్నారు.

పండుగలు, విందులు, శీతల పానీయాలు అతిగా తీసుకోవడం తర్వాత అప్పుడప్పుడు ఉబ్బరం రావడం సహజం. ఇది రోజువారీ అలవాటుగా మారినప్పుడు లేదా వారాల తరబడి కొనసాగినప్పుడు ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా పట్టణ జీవన జీవనశైలి, ఒత్తిడి, తగ్గిన శారీరక శ్రమ కారణంగా క్రియాత్మక జీర్ణశయాంతర సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి స్కాన్‌లలో కనిపించకపోవచ్చు, కానీ అవి ఇప్పటికీ జీవన నాణ్యతను ప్రభావితం చేస్తాయి. రోజువారీ ఉబ్బరం, భోజనం తర్వాత తీవ్రం కావడం, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా విరేచనాలు, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం, అలసట, బరువు తగ్గడం లేదా జ్వరం వంటి కొన్ని లక్షణాలు ప్రత్యేక శ్రద్ధ అవసరమంటున్నారు డాక్టర్లు. మూడు నెలలకు పైగా కొనసాగే జీర్ణ లక్షణాలను స్వీయ చికిత్స కంటే వైద్యులను సంప్రదించడం ముఖ్యం. హార్మోన్లు, థైరాయిడ్ కూడా కీలక పాత్ర పోషిస్తాయి. తక్కువ థైరాయిడ్ స్థాయిలు ప్రేగు కదలికలను నెమ్మదిస్తాయి. హార్మోన్ల మార్పుల కారణంగా ఋతుస్రావం లేదా పెరిమెనోపాజ్ సమయంలో నీరు చేరుకోవడం, పెరిగిన వాయువు కారణం కావచ్చుంటున్నారు. ఒత్తిడి పేగు బాక్టీరియా, కదలికను కూడా ప్రభావితం చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

యాంటాసిడ్‌లు తక్షణ ఉపశమనాన్ని అందిస్తాయి, కానీ పదే పదే వాడటం వల్ల అంతర్లీన సమస్య కప్పివేయంటున్నారు. ఉబ్బరం రెండు నుండి మూడు వారాల కంటే ఎక్కువ కాలం కొనసాగితే.. ఆకలి, నిద్ర, రోజువారీ కార్యకలాపాలను ప్రభావితం చేస్తే, వైద్యుడిని సంప్రదించండి. సాధారణంగా థైరాయిడ్, రక్తహీనత పరీక్షలు, మల పరీక్షలు, అవసరమైతే ఇమేజింగ్ లేదా ఎండోస్కోపీతో సహా రక్త పరీక్షలతో ప్రారంభమవుతాయి. సమతుల్య ఆహారం, ఫైబర్, తగినంత నీరు, క్రమం తప్పకుండా వ్యాయామం, ఒత్తిడి నిర్వహణ తేలికపాటి కేసులలో సహాయపడతాయి. అయితే, శరీరం పదే పదే సంకేతాలను ప్రదర్శిస్తున్నప్పుడు, వాటిని విస్మరించకపోవడమే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



## ఈ మొక్క కనిపిస్తే అస్సలు వదలొద్దు..!

మన ఇంటి చుట్టూ సాధారణంగా పెరిగే కుప్పింటాకు మొక్క, దీనిని ప్రాంతాన్ని బట్టి హరిత మంజరి లేదా మురిపిండి అని కూడా పిలుస్తారు. అపారమైన ఔషధ గుణాలు కలిగిన ఒక అద్భుత వనమూలిక. యూఫోర్బియేసి కుటుంబానికి చెందిన ఈ మొక్క శాస్త్రీయ నామం అకాలిఫా ఇండికా. ఆంగ్లంలో దీనిని ఇండియన్ అకాలిఫా, ఇండియన్ మెర్క్యూరి, ఇండియన్ కాఫర్ లీఫ్ లేదా ఇండియన్ నేటిల్ అని కూడా వ్యవహరిస్తారు. దీని ప్రత్యేకత కప్పాకారంలో ఉండే పుష్పగుచ్ఛం. ఈ మొక్కను పూర్వం నుంచి భారతీయ సంప్రదాయ వైద్యంలో, తమిళుల సిద్ధ వైద్యంలో ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా, పశ్చిమ తూర్పు ఆఫ్రికాలో కూడా ఇది ఒక గొప్ప ఔషధిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆధునిక కాలంలో కూడా వైద్యులు దీనిని వాడమని సిఫార్సు చేయడం కుప్పింటాకు గొప్పతనాన్ని చాటుతుంది.

ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు:

కండరాల నొప్పులు: కుప్పింటాకు తాజా ఆకులను శుభ్రం చేసి రసం తీయాలి. ఈ రసానికి సమానంగా నువ్వుల నూనె కలిపి నీరు ఆవిరి అయ్యే వరకు సన్నటి మంటపై మరిగించి నిల్వ చేసుకోవాలి. కండరాల నొప్పి ఉన్నప్పుడు ఈ నూనెను గోరువెచ్చగా చేసి నొప్పి ఉన్న ప్రదేశంలో రాస్తే ఉపశమనం లభిస్తుంది.

తలనొప్పి: అధిక ఒత్తిడి లేదా ఇతర కారణాల వల్ల వచ్చే తలనొప్పికి, ఈ మొక్క రసాన్ని నుదిటికి రాసి కొంతసేపు విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుంది.

చర్మ సౌందర్యం: పూర్వం నుంచి చర్మ సౌందర్యానికి ఈ మొక్కను ఉపయోగించేవారు. ఆకులను మెత్తగా పేస్ట్ చేసి పసుపు కలిపి ముఖానికి అప్లై చేసి పావుగంట తర్వాత చల్లటి నీటితో కడుక్కుంటే ముఖం తెల్లగా, కాంతివంతంగా మారుతుంది. ఇది మొటిమలు, నల్లటి మచ్చలను తగ్గించి, అవాంఛిత రోమాలను కూడా తొలగించడంలో సహాయపడుతుంది. జీర్ణ, శ్వాసకోశ సమస్యలు: విరోచనం సాఫీగా అవ్వడానికి, శ్వాసకోశ సమస్యలు, కఫం తగ్గించడానికి దీని తాజా ఆకులను రాత్రి గ్లాసు నీటిలో వేసి ఉదయం వడకట్టుకుని రెండు స్పూన్ల మోతాదుగా తాగాలి. అధికంగా తీసుకోకూడదు, వాంతులు అయ్యే అవకాశం ఉంది.

## చివర్లో బ్యాట్ ఝుళిపించిన పోవెల్, హోల్డర్

టీ20 ప్రపంచకప్ 2026లో సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచులో భారత్‌పై వెస్టిండీస్ భారీ స్కోరు చేసింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుండగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓ దశలో తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించిన వెస్టిండీస్.. చివర్లో పోవెల్, జేస్ హోల్డర్ బ్యాట్ ఝుళిపించడంతో ఊహించిన దానికంటే ఎక్కువ రన్సే స్కోరు చేసింది. దీంతో భారత్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. వెస్టిండీస్‌కు బ్యాటింగ్ అప్పగించాడు. అయితే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు మంచి ఆరంభం అందించారు. షై హోప్ (32), రోస్టన్ ఛేజ్ (36) తొలి వికెట్‌కు 68 పరుగులు జోడించారు. ఈ దశలో వరుణ్ చక్రవర్తి.. భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇన్ ఫామ్ బ్యాటర్ షిమ్రాన్ హిట్‌మెయర్ క్రీజులో ఉన్నంత సేపు ధాటిగా బ్యాటింగ్ చేశాడు. 12 బంతుల్లో 27 రన్స్ చేసిన తర్వాత అతడిని జస్‌ప్రీత్ బుమ్రా ఔట్ చేశాడు.

బుమ్రా ఒకే ఓవర్‌లో హిట్‌మెయర్, రోస్టన్ ఛేజ్‌ను ఔట్ చేసి.. భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా కూడా వికెట్ తీయడంతో 15 ఓవర్లు ముగిసే సరికి వెస్టిండీస్.. 125/5తో నిలిచింది. దీంతో తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. కానీ ఆ తర్వాత వెస్టిండీస్ బ్యాటర్లు గేర్ మార్చారు. అర్షదీప్ వేసిన తర్వాతి ఓవర్లో ఏకంగా 24 పరుగులు రాబట్టారు. వరుణ్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో 14 పరుగులు వచ్చాయి.

ఇక చివరకు వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. రోవ్‌మన్ పావెల్ (34), జేసన్ హోల్డర్ (37) కలిసి ఐదో వికెట్‌కు 35 బంతుల్లో 76 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో బుమ్రా రెండు వికెట్లు తీగా. హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి ఒక్కో వికెట్ పడగొట్టారు.



## వెస్టిండీస్‌ను ఓడించలేకపోతే ఐపీఎల్ కాంట్రాక్టులు ఇవ్వొద్దు:

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ ఆదివారం వెస్టిండీస్‌తో వర్చువల్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతోంది. ఇది సూపర్ 8 దశలో భాగమైనప్పటికీ, అసలు ప్రాధాన్యం మాత్రం సెమీఫైనల్ టికెట్‌పైనే నిలిచింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి బయటపడుతుంది. ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన ఇరు జట్లు రెండు పాయింట్లతో సమానంగా ఉన్నాయి. జింబాబ్వేపై భారీ విజయాలు సాధించినప్పటికీ, దక్షిణాఫ్రికాతో ఓటమి చవిచూశాయి.

మనోజ్ తివారీ సంచలన వ్యాఖ్యలు..

మాజీ భారత బ్యాటర్ మనోజ్ తివారీ సరదాగా కానీ కీలక వ్యాఖ్యలు చేశాడు. "భారత్ గత మ్యాచ్‌లో 256 పరుగులు చేసింది. ఆ స్థాయి నుంచి చూస్తే, వెస్టిండీస్‌పై ఎలాంటి ఒత్తిడి లేకుండా 200కి పైగా స్కోర్ చేసి సులభంగా గెలవాలి. వెస్టిండీస్‌ను ఓడించలేకపోతే, ఎవరికీ ఖూా కాంట్రాక్టులు ఇవ్వొద్దు" అని క్రిక్‌బజ్ చర్చలో తివారీ తెలిపాడు.

దక్షిణాఫ్రికాతో మొదటి సూపర్ 8 మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఓడిన భారత్, జింబాబ్వేపై 256/4 భారీ స్కోర్ చేసి 72 పరుగుల తేడాతో గెలిచి బలంగా తిరిగి వచ్చింది.

వీరేంద్ర సెహ్వాగ్ భిన్నాభిప్రాయం..

అదే చర్చలో పాల్గొన్న మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ మాత్రం తివారీ అభిప్రాయానికి భిన్నంగా స్పందించాడు. "మనం అజేయులం కాదు. ఇతర జట్లు కూడా గెలవడానికి వస్తాయి. దక్షిణాఫ్రికాతో ఓ చెడు రోజు ఎదురైంది. జింబాబ్వేను ఓడించాం. ఇప్పుడు వెస్టిండీస్‌ను ఓడిస్తే నవ్వుతూ సెమీఫైనల్‌కు చేరతాం" అని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. "మన దేశం చాలా భావోద్వేగంగా స్పందిస్తుంది. ఒకే ఓటమి తర్వాత ప్రపంచకప్ పోయినట్లుగా స్పందిస్తారు" అంటూ పేర్కొన్నాడు.

సెమీఫైనల్ సమీకరణ..

దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి భారత్‌కు కష్టాలు తెచ్చినా, దక్షిణాఫ్రికా వెస్టిండీస్‌పై గెలవడంతో పరిస్థితి కొంత సులభమైంది.

ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా ఇప్పటికే సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. చివరి స్థానం కోసం భారత్, వెస్టిండీస్ పోటీ పడుతున్నాయి. ఈ హై వోల్టేజ్ మ్యాచ్‌లో గెలిచే జట్టే చివరి నాలుగులో స్థానం సంపాదిస్తుంది.

సెమీస్ పోరు ఇలా..

తొలి సెమీస్ లో భాగంగా న్యూజిలాండ్ వర్సెస్ సౌతాఫ్రికా జట్లు తపడనున్నాయి. ఇక రెండో మ్యాచ్ లో ఇంగ్లాండ్ జట్టుతో తలపడే జట్టు ఏదో మరికొద్దిసేపట్లో తేలనుంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com